## క్లుప్తంగా

### నేడు ప్రత్యేక గ్రీవెన్స్

కాళోజీ సెంటర్: దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమాధికారి జె.హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల నాలుగో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ ఉంటుందని ఆమె తెలిపారు.

### 24 నుంచి పరీక్షలు

కాళోజీ సెంటర్: గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్–1, గ్రేడ్–2, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, బీసీ సంక్షేమ శాఖలో వార్డెన్ గ్రేడ్–1, గ్రేడ్–2, మ్యాటిన్ గ్రేడ్ –1, గ్రేడ్–2 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24 నుంచి 29 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేపర్–1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షకు అర గంట ముందే కేంద్రాల గేట్లు మూసివేయనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు శనివారం నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

### పలకలు, బలపాల పంపిణీ



విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్ బజార్‌లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆరోతరగతి విద్యార్థినులకు పలకలు, బలపాలను హెచ్‌ఎం ఉమా చేతుల మీదుగా హిందీ స్కూల్ అసిస్టెంట్ రాములు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ హిందీ సబ్జెక్టు ఆరవ తరగతి నుంచి ప్రారంభమవుతున్న క్రమంలో హిందీ వర్ణమాల నేర్చుకోవడం కోసం పలకలు, బలపాలను ఉచితంగా అందజేసినట్లు వివరించారు.

### అగ్ని మినిస్ట్రీస్ వార్షికోత్సవం



కాశిబుగ్గ: వరంగల్ లక్ష్మీపురం అగ్ని పెంతుకోస్తు ప్రార్థన మందిరంలో అగ్ని మినిస్ట్రీస్ 32వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ ఎస్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ స్పీకర్ డాక్టర్ శాలెం విక్రాంత్ వర్ధన్ హాజరై ప్రసంగించారు. వేడుకల్లో సంఘ పెద్దలు నర్రా సాగర్, పోలెపాక జాన్సన్, మార్క్, పసునూరి యాకోబ్, కొంగర కుమార్, సతీష్, సురేష్, సుజిత్, ఆదిత్య, పాస్టర్లు యాకోబ్, సువర్ణ రాజు, కాలేబు, ఆరోగ్యం, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### పోచమ్మకు ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలోని పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జేష్ఠమాసం పౌర్ణమి సందర్భంగా ఆలయ పూజారి రమణాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి శుక్రవారం అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, తరగల శ్రీధర్‌బాబు, ఉదయ్‌కుమార్, సారంగపాణి పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం తెట్టె సునీల్(36) దినసరి కూలీగా పనిచేస్తూ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించినప్పటికీ నొప్పి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె.సురేష్ తెలిపారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఐదు రోజుల పాటు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఎస్సై లవన్ కుమార్ కథనం ప్రకారం హనుమకొండ రాంనగర్ ప్రాంతానికి చెందిన ఎండీ.నసీర్ (47) మార్బుల్ టైల్స్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై కాజీపేట నుంచి ఫాతిమా నగర్ 100 ఫీట్ రోడ్డులోకి వెళ్తుండగా వేగంగా వచ్చిన లారీ అతన్ని ఢీకొట్టింది. దాంతో నసీర్ తీవ్రంగా గాయపడగా ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడి భార్య అంజుమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కమలాపూర్ : యోగాసనాలు వేస్తున్న ఎంజేపీ విద్యార్థులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..



# యోగాతో మానసిక ప్రశాంతత

- ఆసనాలు వేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు
- యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించిన గురువులు

కమలాపూర్ : యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య అన్నారు. స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పద్మాసనం, వృక్షాసనం, చక్రాసనం, వజ్రాసనం, దండాసనం, త్రికాసాసనం, పశ్చిముతాసనం, అశ్వసంచలాసనం, ఆంజనేయాసనం, ఉత్కంటాసనం వంటి వివిధ రకాల యోగాసనాలు వేసి గంటన్నర పాటు యోగా సాధన చేయించారు. ఏటీపీ రజిత, డిప్యూటీ వార్డెన్ రమేశ్, ఏఎన్‌ఓ విజయ్, పీఈటీలు ఒస్కుల నాగరాజు, పాక వెంకటేష్, ఉపాధ్యాయులు పబ్బు అశోక్, శ్రావణ్, వెంకటేష్, నాగరాజు, చిరంజీవి, సతీష్, భిక్షపతి, రషీద్, చంటి, మల్లేశం, మోహన్, అజీమ్, భారతి, స్రవంతి, విజయ, మమత, విద్యార్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తిలో..**

ఎల్కతుర్తి : సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలంటే ప్రతీ రోజు యోగా తప్పనిసరిగా చేయాలని వైద్యాధికారిణి రుబీనా సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ పరిధి ప్రాంగణంలో శుక్రవారం గ్రామస్తులకు యోగాసానాలు వేయించి అవగాహన కల్పించారు. ప్రతీరోజు యోగా చేయడం ద్వారా బుద్ధిబలంతో పాటు శరీర దృఢత్వం పెపొందుతుందని అన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళన నుంచి విముక్తి కలుగుతుందని సూచించారు. దీర్ఘకాలిక నొప్పులు, శరీర గాయాలు తగ్గుముఖం పడుతాయని అన్నారు. రోగులకు, గ్రామస్తులకు యోగసానాలు నేర్పించారు. రవీందర్‌రెడ్డి, విమలకుమారి, సుధాకర్, కెఎల్‌ఎస్ స్వామి, సుధీర్, యాకూబ్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నడికూడలో..

**త్మకూరులో..**

ఆత్మకూరు : యోగాతోనే మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల పంచాయతీ అధికారి చేతన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అక్కంపేట జిల్లా పరిషత్ స్కూల్‌లో శుక్రవారం యోగా చేశారు. అలాగే మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధ్వర్యంలో యోగా చేశారు. యోగా సాధన ద్వారా మనస్సును అధీనంలో ఉంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, సత్యనారాయణ, సదానందం, పైడి పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : వంగరలో..

**నడికూడలో..**

నడికూడ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని కంఠాత్మకూర్‌లో ఎంపీఓ సయ్యద్ అఫ్జల్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఆరోగ్య ఉపకేంద్రం వద్ద డాక్టర్ సిరికొండ అనూహ్య యోగాసనాలు వేసి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి భార్గవి, కారోబార్ రమేశ్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

**శాయంపేటలో..**

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిరోజు యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. యోగా ద్వారా మానసిక రుగ్మతల నుంచి కాపాడుకోవచ్చని అన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

**దామెరలో..**

దామెర : మండల వ్యాప్తంగా యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈరాయి చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు యోగా చేశారు. ఏపీఓ శారద, టీఏ సురేందర్, కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏకశిలా ప్రైమ్‌లో యోగా దినోత్సవం నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో యోగా గురువులు( పీఈటీ)లు యోగాసనాలు వేయించారు.



దామెరలో..

**పరకాలలో..**

పరకాల : అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగింది. యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కోర్టులో ప్రముఖులకు, వైద్యులకు, న్యాయవాదులకు, వ్యాపారస్తులకు యోగా శిక్షణ ఇచ్చారు. అనంతరం రాజేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. జడ్జి శాలిని లింగం, ప్రముఖ వైద్యులు కాశీప్రసాద్‌రావు, డాక్టర్ నాగబండి విద్యాసాగర్, కౌన్సిలర్లు ఆర్‌పీ జయంత్ లాల్, బెజ్జంకి పూర్ణచారి, ఎస్వీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి, ఆడగాని జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.



దామెర : యోగా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు



ఆత్మకూరులో..



పరకాలలో..



శాయంపేటలో..

### ఫెన్సింగ్ తొలగించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రం నుంచి మాందారిపేటకు వెళ్లే ప్రధానరహదారి ప్రక్కన జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల సమీపంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ఇటీవల సాక్షిలో 'పొంచి ఉన్న ప్రమాదం' కథనానికి స్పందించారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఏడీఏ దేవేందర్‌నాయక్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది కంచెను తొలగించారు. రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సదరు కాంట్రాక్టర్ ఫెన్సింగ్ పక్క నుంచే రోడ్డు వేయగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

### రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

దామెర : ఉపాధిహామీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఆర్డీఓ పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు కోగిల్వాయి, తక్కళ్లపహాడ్ గ్రామాలను శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో కేంద్ర ప్రభుత్వ బృందం మండలంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రిజిస్టర్లను తనిఖీ చేయనున్న నేపథ్యంలో వాటిని సిద్ధం చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని, విధుల్లో అలసత్వం వహించొద్దన్నారు. ఆయనవెంట ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేద బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలి



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : వివేకానంద స్కీం ద్వారా పేద బ్రాహ్మణుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు మోత్కూరి రాము, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉదయమర్రి కృష్ణమూర్తి, గ్రేటర్ వరంగల్ కోశాధికారి, హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి విష్ణుదాసు వంశీధర్‌రావు కోరారు. ఈ మేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రాహ్మణ పేద విద్యార్థుల కోసం, పేద బ్రాహ్మణుల కోసం ప్రారంభించిన వివేకానంద స్కీం ద్వారా ఇతర దేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లిన వారి కోసం మంజూరు చేసిన రుణాలను, పేద బ్రాహ్మణుల వ్యాపారాల నిమిత్తం మంజూరు చేసిన రుణాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలు.. బ్రాహ్మణుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజలను సమన్యాయంగా చూస్తుందని ఎమ్మెల్యే అన్నారు.

### నేడు భగీరథ నీటి సరఫరా బంద్

కమలాపూర్ : మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాలకు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.రాంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కం వెంకటేష్, సంజయ్, దేవయ్య పాల్గొన్నారు.

### కవాతును జయప్రదం చేయాలి

ధర్మసాగర్ : జూలై 7న వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎల్కుర్తి గ్రామంలో శుక్రవారం మాదిగల ఆత్మగౌరవ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. మండల నాయకుడు పుట్ట దేవరాజ్, కొలిపాక రమేశ్, కొలిపాక కరుణాకర్ పాల్గొన్నారు.

# రెండు రూపాయలకు మినరల్ వాటర్

సాక్షి స్పందన

ఐనవోలు : రెండు రూపాయలకే 20 లీటర్ల స్వచ్ఛమైన శుద్ధి చేసిన తాగు నీటిని అందించే మినరల్ వాటర్‌ప్లాంట్ పునఃప్రారంభమైంది. మండలంలోని పంథిని గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగే మినరల్ వాటర్‌ప్లాంట్ ఆరు నెలలుగా మూతపడటంతో 'మినరల్ వాటర్ ప్లాంట్‌ను తెరిపించండి' అనే శీర్షికన ఈ నెల 10వ తేదీన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులు, నాయకులతో మాట్లాడి ప్లాంట్ మరమ్మతు చేయించి శుక్రవారం ఆయన పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించి ప్లాంట్‌ను తెరిపించినందుకు గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.10 చెల్లించి ప్రయివేట్ మినరల్ వాటర్ కొనుగోలు చేసే బాధ తీరిపోయిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

### ఆరోపణలు అర్థరహితం

వేలేరు : స్వంత భూమికి ఫెన్సింగ్ వేసుకుంటే ప్రభుత్వ భూమి అని ఎంపీపీ సమ్మిరెడ్డి ఆరోపించడం సరికాదని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన గాదె రాజిరెడ్డి తెలిపారు. తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేసేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. గుండ్లసాగర్‌లో సర్వే నంబర్ 2/ఎఫ్/1లో 2.38 ఎకరాల భూమి ఉండగా 2003 సంవత్సరంలో 2.05 ఎకరాల భూమిని బీసీ కాలనీకి ఇచ్చామని మిగతా 33 గుంటల భూమి తనపేరుపై ఉందని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపించడం సరికాదని హితవు పలికారు. వ్యక్తిగతంగా ఇబ్బందులు కలిగించేందుకు ఎంపీపీ సమ్మిరెడ్డి పూనుకున్నాడని ఆయన ఆరోపించారు.

# స్వరాష్ట్రం కోసం పరితపించిన జయశంకర్

శాయంపేట : తెలంగాణ స్వరాష్ట్రం కోసం తన ప్రాణం ఉన్నంత వరకు పరితపించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కొనియాడారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ భావజాల వ్యాప్తికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అన్నారు. స్వరాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను రాష్ట్ర ప్రజలకు తెలియపరచడంలో ఆయన పాత్ర అనిర్వచనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను స్ఫూర్తిగా తీసుకుకోవాలన్నారు. సారు కలలను సాకారం చేసేందుకు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిందం రవి, మారేపల్లి రాజు, కట్టయ్య, రాజేందర్, నాగరాజు, ప్రవీణ్, నరేష్, రాజయ్య పాల్గొన్నారు.



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

# హరితహారానికి సర్వం సిద్ధం

- మండల వ్యాప్తంగా లక్షా 26 వేల మొక్కలు టార్గెట్..
- పొలాల గట్లు, ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు
- నర్సరీల్లో ఏపుగా పెరిగిన మొక్కలు

నడికూడ : మొక్కలు నాటడంతో పాటు సంరక్షించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన హరితహారం కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. వివిధ నర్సరీల్లో పెరిగిన మొక్కలను నాటేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఆడవుల విస్తీర్ణం పెంచే విధంగా మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో మండలంలో ఒకటి, రెండు నర్సరీలు మాత్రమే ఏర్పాటు చేసి మొక్కలు పెంచేవారు. ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు.

**– లక్షా 26 వేల టార్గెట్..**

మండల వ్యాప్తంగా చేపట్టనున్న హరితహారంలో లక్షా 26 వేల మొక్కలు నాటడమే లక్ష్యమని అధికారులు వెల్లడిస్తున్నారు. మండలంలోని మేజర్ గ్రామాలైన నడికూడ, చర్లపల్లి, వరికోల్, చౌటుపర్తి, ధర్మారం, కంఠాత్మకూర్, ముస్త్యాలపల్లి, నార్లపూర్, పులిగిల్ల, రాయపర్తితో పాటు పలు గ్రామాల్లో 9 వేల మొక్కలు, కౌకొండ, రామకృష్ణపూర్ గ్రామాల్లో 6 వేల మొక్కలు, సర్వాపూర్‌లో 7 వేల మొక్కలు, వెంకటేశ్వర్లపల్లిలో 8 వేల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండంలోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటేందుకు స్థలాలను ఎంపిక చేయడం, అవెన్యూ ప్లాంటేషన్, రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నర్సరీల నిర్వహణ ఉపాధి హామీ సిబ్బందికి అప్పగించారు. నర్సరీలో ఉపయోగపడే పండ్ల, పూల, మొక్కలతో పాటు గానుగు, వేప, చింత తదితర మొక్కలను పెంచుతున్నారు.



మండల కేంద్రంలోని నర్సరీలో మొక్కలు



నర్సరీలోని మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు

# అనుమతి లేని పాఠశాలలపై చర్య తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


విద్యారణ్యపురి: ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయించాలని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, మహేందర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**'ప్రైవేట్' విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి**

కేయూ క్యాంపస్: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఏబీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ మచ్చ పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షుడు చరణ్, బాధ్యులు భరత్, అశోక్, కిరణ్, నవీన్, సురేష్, వినయ్, నాగరాజు, మంజునాథ్, జితేష్ పాల్గొన్నారు.

### దోమల నివారణకు చర్యలు

ఖిలా వరంగల్: ఖాళీ స్థలాల్లో మురుగునీరు ఉండకుండా స్థానికులు చూసుకోవాలని, మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మరుపల్లి రవి తెలిపారు. వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో బల్దియా మలేరియా విభాగం ఆధ్వర్యంలో మురుగు కాల్వల్లో శుక్రవారం ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకునే బాధ్యత స్థానికులదేనని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.



### మెట్ల బావిని సుందరంగా తీర్చిదిద్దుతాం

ఖిలా వరంగల్: జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో మూడు అంతస్తుల మెట్ల బావిని రూ.50 లక్షల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దుతామని 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి అన్నారు. శివనగర్‌లోని చారిత్రక మెట్ల బావి అభివృద్ధి, సుందరీకరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని బన్సిలాల్‌పేట ఐదంతస్తుల మెట్ల బావి తరహాలో దీన్నికూడా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. బావికి మరమ్మతులు, పూడిక, స్లాప్ వేసిన అనంతరం పూల వనంతోపాటు గార్డెనింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బజ్జూరి అంజయ్య, బిల్లా రాజు, కొత్తగట్టు శ్యామ్, వంగర సతీష్, ఇందిర పాల్గొన్నారు.

